
www.kalamjyothi.com

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

బుధవారం
28.10.2026



365 కరువు మండలాలు!



- భారీగా తగ్గిన సాగు.. పడిపోయిన నిల్వలు
- తక్షణ సహాయక చర్యలకు ప్రభుత్వం ఆదేశం
- 111 మండలాల్లో తీవ్ర కరువు పరిస్థితులు
- సాగు విస్తీర్ణంలో 13.22 లక్షల ఎకరాల తగ్గుదల
- వారం రోజుల్లోగా కేంద్రానికి సమగ్ర నివేదిక

2 లో..

రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరి స్థితులను పరిగణనలోకి తీసుకుని 31 జిల్లాల పరిధిలోని 365 మండలాలను ప్రభుత్వం కరువు ప్రభావిత ప్రాంతాలుగా అధికారికంగా ప్రకటించింది. 2026 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రెవెన్యూ (విపత్తు నిర్వహణII) శాఖ ద్వారా జీఓ ఎంఎస్ నెం.3ను జారీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో 111 మండలాల్లో తీవ్ర కరువు, మరో 254 మండలాల్లో మోస్తరు కరువు ఉన్నట్లు గుర్తించారు. కేబినెట్ ఉపసంఘం సిఫారసుల మేరకు తీసుకున్న ఈ నిర్ణయం నాటి నుంచి ఆరు నెలల పాటు అమల్లో ఉంటుందని, తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు.

కలంజ్యోతి, బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా 31 జిల్లాల్లో తీవ్ర వర్షాభావం



వైభవంగా శ్రీవారి రథోత్సవం

- బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- వేదమంత్రాలతో పూర్ణకుంభ స్వాగతం పలికిన పండితులు
- గరుడ వాహనంపై గ్రామ వీధుల్లో ఊరేగింపు

2 లో..



తెలంగాణపై అర్నాబ్ ప్రభావం!

కలంజ్యోతి, హైదరాబాద్ : అర్నాబ్ తుఫాన్ ప్రభావం ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ రాష్ట్రంపైనా స్వల్పంగా పడనుందని వెదర్ మ్యాన్ బాలాజీ తెలిపారు. రాబోయే గంటల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేట, దమ్మపేట, మలకలపల్లి, ఖమ్మం జిల్లాలోని నత్తుపల్లి, వేంసూరు, పెనుబలి పరిసర ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాగే అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో మోస్తరు వానలు పడే సూచనలు ఉన్నాయని, రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాలపై తుఫాన్ ప్రభావం పెద్దగా ఉండదని స్పష్టం చేశారు. ప్రస్తుతం భానుడి భగభగలు, తీవ్ర ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్ష సూచన కాస్త ఉపశమనం కలిగించనుంది.


- మిగిలిన ప్రాంతాల్లో పెద్దగా ఉండని ప్రభావం
- ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు ఉపశమనం

- పలు జిల్లాల్లో మోస్తరు వర్షా లు కురిసే అవకాశం

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
2
బుధవారం 28.10.2026
www.kalamjyothi.com

365 కరువు మండలాలు!





కలంజ్యోతి, హైదరాబాద్ (అక్టోబర్ 27) : రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల తీవ్రతను పరిగణనలోకి తీసుకుని 31 జిల్లాల పరిధిలోని 365 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. 2026 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రెవెన్యూ (విపత్తు నిర్వహణII) శాఖ ద్వారా జీఓ ఎంఎస్ నెం.3ను జారీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. గుర్తించిన మండలాల్లో 111 తీవ్ర కరువు కోరల్లో చిక్కుకోగా, మరో 254 మండలాల్లో మోస్తరు కరువు పరిస్థితులు ఉన్నట్లు వెల్లడించారు. జిల్లాల వారీగా నల్గొండ, సంగారెడ్డిలలో అత్యధికంగా 28 చొప్పున మండలాలు ఉండగా, సూర్యాపేటలో 23, ఆదిలాబాద్, వికారాబాద్‌లలో 20 చొప్పున, నిజామాబాద్, రంగారెడ్డిలలో 18 చొప్పున, ఖమ్మం, యాదాద్రి భువనగిరిలలో 17 చొప్పున ప్రభావిత ప్రాంతాలుగా తేలాయి. అక్టోబర్ 23న సమావేశమైన కేబినెట్ ఉపసంఘం చేసిన సిఫారసుల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నామని, కరువు ప్రకటన ఉత్తర్వులు వెలువడిన నాటి నుంచి ఆరు నెలల పాటు అమల్లో ఉంటాయని ప్రభుత్వం స్పష్టం చేసింది.

17 శాతం లోటు వర్షపాతం నమోదు..

నైరుతి రుతుపవనాల కాలంలో ఆశించిన మేర వర్షాలు కురవకపోవడం, దీర్ఘకాలిక పొడి వాతావరణం, భూగర్భ జలాలు అడుగంటడం, నేలలో తేమ తగ్గడం వంటి శాస్త్రీయ అంశాల ప్రాతిపదికన కరువు మండలాలను ఖరారు చేశారు. జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు రాష్ట్రంలో సాధారణంగా 740.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 615.5 మిల్లీమీటర్లు మాత్రమే కురిసి 17 శాతం లోటు ఏర్పడింది. మండలాల ఎంపిక కోసం వర్షపాతం లెక్కలతో పాటు శాటిలైట్ రిమోట్ సెన్సింగ్ ద్వారా వృక్ష సంపద స్థితిగతులను పరిశీలించారు. ప్రతి మండలంలోని 10 శాతం గ్రామాల్లో అధికారులు నేరుగా క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించి సమర్పించిన నివేదికలను పరిశీలించిన అనంతరమే ఈ నిర్ధారణకు వచ్చారు. జాబితాలో లేని మండలాల పరిస్థితులను సైతం పర్యవేక్షణ కేంద్రం ఎప్పటికప్పుడు గమనిస్తుందని, అవసరమైతే అదనపు నోటిఫికేషన్ ద్వారా కొత్త మండలాలను చేరుస్తామని యంత్రాంగం పేర్కొంది.

భారీగా తగ్గిన సాగు.. పడిపోయిన నిల్వలు..

వర్షాలు లేకపోవడంతో రాష్ట్రంలో వ్యవసాయ సాగు విస్తీర్ణం ఊహించని రీతిలో పడిపోయింది. ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 139.28 లక్షల ఎకరాలు కాగా, ఈ సీజన్‌లో అది 126.06 లక్షల ఎకరాలకే పరిమితమై ఏకంగా 13.22 లక్షల ఎకరాల మేర సాగు తగ్గింది. ప్రధానంగా వరి పంట సాగుపై తీవ్ర ప్రభావం పడి 69.19 లక్షల ఎకరాల నుంచి 57 లక్షల ఎకరాలకు పడిపోవడంతో 18 శాతం మేర విస్తీర్ణం క్షీణించింది. మరోవైపు రాష్ట్రంలోని ప్రధాన, మధ్యతరహా జలాశయాల మొత్తం నిల్వ సామర్థ్యం 585 టీఎంసీలు కాగా, ప్రస్తుతం కేవలం 179.63 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉండటం కలవరపెడుతోంది. ప్రాజెక్టుల్లో నీటి మట్టాలు గణనీయంగా తగ్గడం వల్ల రాబోయే రోజుల్లో తాగునీటి సరఫరా, సాగు అవసరాలు, విద్యుత్ ఉత్పత్తి, పశుసంపద సంరక్షణపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం పొంచి ఉందని నివేదికలో ఆందోళన వ్యక్తం చేశారు.

తక్షణ సహాయక చర్యలకు ప్రభుత్వం ఆదేశం..

ప్రభావిత ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడటం, పశుగ్రాసం కొరత లేకుండా శిబిరాలు ఏర్పాటు చేయడం, గ్రామీణ ప్రజలకు ఉపాధి పనులు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించింది.

కేంద్రం నుంచి జాతీయ విపత్తు స్పందన నిధి (ఎన్‌డీఆర్ఎఫ్) నిధులు కోరేందుకు వారం రోజుల్లోగా సమగ్ర నివేదికను సిద్ధం చేసి పంపాలని ప్రణాళిక శాఖను ఆదేశించింది. కేంద్రం నుంచి సాయం అందిన నెల రోజుల్లోగా అర్హులైన రైతులకు డీబీటీ పద్ధతిలో పెట్టుబడి సాయాన్ని నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని, లబ్ధిదారుల జాబితాలను అధికారిక వెబ్‌సైట్లలో పారదర్శకంగా ఉంచాలని స్పష్టం చేసింది. బ్యాంకులు రైతుల నుంచి రుణ వసూళ్ల పేరిట బలవంతపు చర్యలకు దిగకుండా చర్యలు తీసుకోవాలని, వ్యవసాయ రుణాల పునర్వ్యవస్థీకరణపై రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీతో చర్చలు జరపాలని కలెక్టర్లకు నిర్దేశించింది.



పట్టభద్రుల ఓటరు నమోదును
విజయవంతం చేయాలి

రేపు బీఆర్ఎస్ సన్నాహక భేటీకి

ఎమ్మెల్సీ పోచంపల్లి రాక

కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 27) : వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన వారందరినీ ఓటర్లుగా నమోదు చేయించేందుకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 29న గురువారం ఉదయం 10 గంటలకు మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సన్నాహక సమావేశం జరగనుంది. ఈ భేటీకి నర్సంపేట ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఓటరు నమోదు ప్రక్రియపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాల్నే వెంకన్న మాట్లాడుతూ మండల కార్యవర్గ సభ్యులు, గ్రామాల ఎన్నికల ఇన్‌చార్జిలు, ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధులు, యువజన, గ్రామ పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వైభవంగా శ్రీవారి రథోత్సవం





కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 27) : గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామంలోని శ్రీ హరిహర దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం నిర్వహించిన రథోత్సవ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా విచ్చేసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వేదమంత్రాలతో

పూర్ణకుంభ స్వాగతం పలికిన పండితులు

ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ఆలయ కమిటీ చైర్మన్ పాపారావుతో పాటు వేద పండితులు రాధాకృష్ణ శర్మ, రామాచారి, సప్తగిరి, సుధాకర్ శర్మ వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం వేద పండితులు ఆయనకు ఆశీర్వచనాలు పలకగా, ఆలయ కమిటీ తరఫున చైర్మన్ పాపారావు తీర్థప్రసాదాలు అందజేశారు.

గరుడ వాహనంపై గ్రామ వీధుల్లో ఊరేగింపు

శ్రీ వేంకటేశ్వరస్వామిని గరుడ వాహనంపై విశేషంగా అలంకరించి, భాజాభజంత్రీలు, మంగళవాయిద్యాలు, భక్తుల భజనల నడుమ పురవీధుల్లో వైభవంగా రథోత్సవం నిర్వహించారు. ఈ వేడుకలో గంభీరావుపేట మండలంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనగా, ఏఎంసీ చైర్మన్ హమీద్, సహకార సంఘం చైర్మన్ వేషాల వెంకటి, లింగన్నపేట సర్పంచ్ పిట్ల ఎల్లయ్య, ఆలయ వైస్ చైర్మన్ జోగు సురేష్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్, కొత్తపల్లి గ్రామ అధ్యక్షుడు మెండే భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రశస్తి స్క్రీనింగ్‌ను విజయవంతం చేయాలి

నవంబర్ 8లోగా ప్రక్రియ పూర్తి చేయాలి

ఎంఈఓ మానుపాటి పాపమ్మ

కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 27) : ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులను గుర్తించి వారికి తగిన సహాయం అందించేందుకు ప్రశస్తి 2.0 స్క్రీనింగ్ ఎంతగానో దోహదపడుతుందని, దీనిని విజయవంతం చేయాలని ఎంఈఓ మానుపాటి పాపమ్మ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని హైస్కూల్‌లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు మంగళవారం నిర్వహించిన శిక్షణ సదస్సుకు ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. ఉపాధ్యాయులు ప్రశస్తి యాప్‌లోని ప్రశ్నలకు సమాధానాలు నమోదు చేసి, నవంబర్ 8వ తేదీలోగా మండలంలోని అన్ని పాఠశాలల్లో స్క్రీనింగ్ ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు టీవీ సత్యనారాయణ, వరలక్ష్మి, రాము, వివిధ పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.



కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

3

బుధవారం 28.10.2026

www.kalamjyothi.com



దళితులపై దాడి అమానుషం!

నిందితులను తక్షణమే అరెస్టు చేయాలి : ఎంఆర్‌పీఎస్

కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 27) : దసరా పండుగ సందర్భంగా ఉప్పరపల్లి గ్రామంలో దప్పులు వాయిస్తున్న దళితులపై కులం పేరుతో దూషించి దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని ఎంఆర్‌పీఎస్ డిమాండ్ చేసింది. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు బిర్రు మహేందర్ మాదిగ, వరంగల్ జిల్లా మాజీ అధ్యక్షుడు కట్ల రాజశేఖర్ మాదిగ మాట్లాడారు. కేసు నమోదైనా నిందితులు బాధిత కుటుంబాన్ని వేధిస్తున్నారని, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి స్పందించి గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తడుగుల విజయ్ మాదిగ, గోలి సుధాకర్ మాదిగ, బొమ్మెర రవీందర్ మాదిగ, బిర్రు భిక్షపతి మాదిగ, నవీన్ల మల్లయ్య, పులి సాంబయ్య, ఎల్దొండ మల్లయ్య, బరుపట్ల వీరేశం, బొమ్మెర సాంబయ్య, నవీన్ల పవన్, గూడెల్లి బాబు, నవీన్ల మణికంఠ, బొమ్మెర మహేందర్, నవీన్ల ప్రవీణ్, బరుపట్ల అఖిల్, బరుపట్ల రాజు తదితరులు పాల్గొన్నారు.



త్రోబాల్ జిల్లా అధ్యక్షుడిగా శివరాం

కలంజ్యోతి, ఇల్లంతకుంట (అక్టోబర్ 27) : రాజన్న సిరిసిల్ల జిల్లా త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఇల్లంతకుంట మండల కేంద్రానికి చెందిన దాసరి శివరాం నియమితులయ్యారు. రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ స్టేడియంలో తెలంగాణ రాష్ట్ర త్రోబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు రవి నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా దాసరి శివరాం, ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ అజీమ్, కోశాధికారిగా ఎండీ నవాబ్‌ను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి టి. కృష్ణారెడ్డి, కోశాధికారి షేక్ జమీల్, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొనగా, శివరాం నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.



ఏబీవీపీ మండల కార్యవర్గం ఎన్నిక

కన్వీనర్‌గా కాసుపాక విష్ణువర్ధన్

కలంజ్యోతి, ఇల్లంతకుంట (అక్టోబర్ 27) : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఇల్లంతకుంట మండల నూతన కార్యవర్గాన్ని మంగళవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మంద వంశీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల్లో జాతీయ భావాలు, నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తూ ఎబివిపి ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఎదిగిందని, నూతన బాధ్యులు విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. మండల కన్వీనర్‌గా కాసుపాక విష్ణువర్ధన్, కోకన్వీనర్లుగా ఋషివేంద్ర, అనూష, సోషల్ మీడియా కన్వీనర్‌గా సిద్ధార్థ, హాస్టల్ కన్వీనర్‌గా శ్రీవర్ధన్, ఖేల్ కన్వీనర్‌గా అభిషేక్, ఎస్ఎఫ్‌డీ కన్వీనర్‌గా రాంచరణ్ ఎన్నికయ్యారు.

పబ్లిక్ టాయిలెట్లపై అధికారుల నిర్లక్ష్యం!

- 6నెలలైనా అందుబాటులోకి రాని కొత్త టాయిలెట్లు
- మొబైల్ టాయిలెట్లతోనూ తప్పని తిప్పలు
- సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్





కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 27) : సిరిసిల్ల పట్టణ పాత బస్టాండ్‌లో పాత టాయిలెట్లను కూల్చివేసి ఆరు నెలలు గడుస్తున్నా కొత్తవాటిని నిర్మించి అందుబాటులోకి తీసుకురాకపోవడం దారుణమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు బరకం వెంకటలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యం వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే ప్రధాన బస్టాండ్‌లో కనీస మరుగుదొడ్ల వసతి లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు తీవ్రమైన అసౌకర్యానికి గురవుతున్నారని, ప్రజలకు అత్యవసరమైన కనీస వసతులు కల్పించడంలో మున్సిపల్ అధికారులు ఘోరంగా విఫలమయ్యారని మండిపడ్డారు.

మొబైల్ టాయిలెట్లతోనూ తప్పని తిప్పలు..

ప్రయాణికుల కోసం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మొబైల్ టాయిలెట్లలో నీటి సదుపాయం లేకపోవడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతూ అపరిశుభ్రంగా మారాయని బరకం వెంకటలక్ష్మి పేర్కొన్నారు. సరైన నిర్వహణ లేకపోవడంతో మహిళలు వాటిని ఉపయోగించలేక నరకయాతన అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా రవాణా కేంద్రాల్లో మహిళలకు గౌరవప్రదమైన, పరిశుభ్రమైన వసతులు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, ఇంతటి కీలకమైన ప్రజా సమస్యపై పాలకులు, అధికారులు ఆరు నెలలుగా పట్టించుకోకపోవడం వారి బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని ధ్వజమెత్తారు.

సమస్యను తక్షణమే పరిష్కరించాలి

సంబంధిత అధికారులు ఇప్పటికైనా నిద్రమత్తు వీడి పాత బస్టాండ్‌లో నూతన పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కొత్త నిర్మాణాలు పూర్తయ్యేంతవరకు తాత్కాలిక మొబైల్ టాయిలెట్లలో నిరంతర నీటి వసతి కల్పిస్తూ, ఎప్పటికప్పుడు పారిశుధ్య పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ప్రయాణికులు, మహిళల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని మరుగుదొడ్ల సమస్యను తక్షణమే పరిష్కరించకపోతే ప్రజా పక్షాన ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



మొక్కలు నాటితేనే సమృద్ధిగా వర్షాలు

ఎలనినోపై అప్రమత్తంగా ఉండి నీటిని పొదుపు చేయాలి : జిల్లి సర్పంచ్ యాట సుధాకర్

కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 27) : చెట్లను విచ్చలవిడిగా నరకడం వల్లే పర్యావరణ సమతుల్యత దెబ్బతిని వర్షపాతం తగ్గుతోందని, ప్రకృతిని కాపాడితేనే అది మనల్ని కాపాడుతుందని జిల్లి సర్పంచ్ యాట సుధాకర్ పేర్కొన్నారు. మండలంలోని జిల్లి గ్రామ హైస్కూల్‌లో ఎల్‌నినో ప్రభావం, రానున్న కరువు పరిస్థితులపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. భూగర్భ జలాలు అడుగంటుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఇప్పటి నుంచే నీటిని, విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని, రైతులు తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలు సాగు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం వెంకటేశ్వర్లు, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం ఈర్య, ఉపాధ్యాయులు, కొర్ర మోహన్, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల టీం లీడర్ పడిదం రాజేందర్, తాళ్ల సునీల్, యోచన, నెల్లుట్ల సుమన్, గాదెపాక బాబు, బరిగెల రవీందర్, కందగట్ల రామకృష్ణ, తాళ్లపల్లి అశోక్, వాంకుడోత్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ పావనానికి భక్తిశ్రద్ధలతో ఓడిబియ్యం

నవంబర్ 14 నుంచి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలు

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 27) : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో దాతల సహకారంతో సుమారు రూ.3 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో నవంబర్ 14, 15, 16 తేదీల్లో బ్రహ్మశ్రీ రాధాకృష్ణ శర్మ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్టాపన, 17, 18 తేదీల్లో సిద్ధోగం నిర్వహించనున్నట్లు గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గంట దేవయ్య గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా తాతముత్తాతల కాలం నాటి ఆనవాయితీ ప్రకారం గౌడ సంఘం ప్రతినిధులు నెమలి ఈకలతో కూడిన ఎల్లమ్మ గద, పావనంతో మంగళవారం మంగళవాయిద్యాలు, పోతరాజుల విన్యాసాల నడుమ బొప్పాపూర్ ఏఎంసీ మాజీ వైస్ ప్రెసిడెంట్ గుండాడి రాంరెడ్డి, లక్ష్మి, వెంకట్ రెడ్డి, పద్మ దంపతులు, వారి తల్లి గౌరమ్మ ఇంటికి, అనంతరం సింగిల్ విండో అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి ఇంటికి వెళ్లారు. అక్కడ కుటుంబ సభ్యులు పావనానికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేసి ఓడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకోవడంతో పాటు ఆలయానికి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం ప్రతినిధులు నాగుల ఎల్లా గౌడ్, చింతకింది బాలకిషన్ గౌడ్, పందిర్ల సత్తయ్య గౌడ్, నాగుల ప్రదీప్ గౌడ్, ఆంకాశి రాములు గౌడ్, గంట బుచ్చాగౌడ్, నారాయణ గౌడ్, వెంకటి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
బుధవారం 28.10.2026
4
www.kalamjyothi.com

భూముల ఆక్రమణలపై ఉక్కుపాదం

ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు తొలగించండి

కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశాలు



కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 27) : నిర్మల్ జిల్లా వ్యాప్తంగా నీటిపారుదల శాఖకు చెందిన భూములు అన్యాక్రాంతం కాకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పాల్పడే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణంలోని ధర్మసాగర్ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో జరిగిన ఆక్రమణలను కలెక్టర్ పరిశీలించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమంగా వెంచర్ ఏర్పాటు చేసేందుకు చేపట్టిన నిర్మాణాలను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేయాలని సూచించారు. ధర్మసాగర్ చెరువు సమీపంలో అనధికారికంగా నిర్మించిన లేఅవుట్ ఫెన్సింగ్ గోడను అధికారులు కలెక్టర్ ఆదేశాల మేరకు కూల్చివేశారు. నిర్మాణ పనులకు వినియోగిస్తున్న యంత్రాలు, సామగ్రి, ఇసుక తదితర వస్తువులను స్వాధీనం చేసుకుని, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.సినీటిపారుదల శాఖ భూములు, చెరువుల పరిధిలో ఆక్రమణలు జరగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆక్రమణలను గుర్తించడంలో నిర్లక్ష్యం వహించరాదని, ప్రభుత్వ భూముల పరిరక్షణకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట నీటిపారుదల శాఖ ఈఈ అనిల్, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, తహశీల్దార్ రాజు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో మౌలిక వసతులు

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమంద్ అలీ



కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 27) : నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న జిల్లా గ్రంథాలయాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమంద్ అలీ స్పష్టం చేశారు. సంస్థ సర్వసభ్య సమావేశం చైర్మన్ సయ్యద్ అర్జుమంద్ అలీ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధి, పాఠకులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు సంబంధించి ఎనిమిది ప్రధాన అంశాలపై చర్చించి, అన్ని తీర్మానాలకు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. సమావేశం అనంతరం చైర్మన్ సయ్యద్ అర్జుమంద్ అలీ వివరాలు వెల్లడిస్తూ జిల్లాలోని శాఖా గ్రంథాలయాలకు నూతన భవనాల నిర్మాణం చేపట్టడంతో పాటు పాఠకులకు తాగునీరు, ఫర్నిచర్ తదితర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ ప్రతిపాదనలు, నిధుల వినియోగానికి సర్వసభ్య సమావేశం ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు గ్రంథాలయాలు మరింత ఉపయోగపడేలా అభివృద్ధి కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా చేపడతామని చైర్మన్ తెలిపారు. పాఠకులకు మెరుగైన సేవలు అందిస్తూ జిల్లాలో పఠన సంస్కృతిని, విజ్ఞాన సంపదను పెంపొందించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఏసిజిఈ పరమేశ్వర్, డిపిఆర్ఓ విష్ణువర్ధన్, జిల్లా పంచాయతీ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ప్రశాంత్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కే. క్రితిన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దు

- మద్దతు ధరతో కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి
- ఆరుతడి పంటల సాగుతో కరువును అధిగమించాలి



కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 27) : రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని బొప్పాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిపల్లి దేవానందం పిలుపునిచ్చారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు రాగట్లపల్లి, పదిర, హరిదాస్ నగర్, వెంకటాపూర్, పోతిరెడ్డిపల్లి, అగ్రహారం గ్రామాలలో స్థానిక సర్పంచులతో కలిసి ఐకేపీ వడ్ల కొనుగోలు కేంద్రాలను ఆయన మంగళవారం ప్రారంభించారు. రైతులు ధాన్యంలో 17 శాతం తేమ ఉండేలా ఆరబోసి కేంద్రాలకు తీసుకురావాలని, మిల్లర్లు ప్రభుత్వ మద్దతు ధర కంటే ఎక్కువ ఇస్తే రైతులకు నచ్చిన చోట అమ్ముకోవచ్చని సూచించారు.మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికే ప్రభుత్వం మహిళా సంఘాల ద్వారా కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తోందని తెలిపారు.

ఆరుతడి పంటల సాగుతో కరువును అధిగమించాలి..

ఎల్‌నినో ప్రభావం వల్ల తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశాలున్నందున రైతులు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని ఏఎంసీ ఛైర్మన్ మేడిపల్లి దేవానందం, స్థానిక సర్పంచ్ ఎనుగందుల నరసింహులు,సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు దొమ్మాటి నరసయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు షేక్ గౌస్ బాయ్ కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలను పాటిస్తూ రైతాంగం నష్టపోకుండా ముందస్తు ప్రణాళికతో సాగు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి కృష్ణ యాదవ్, ఏఎంసీ వైస్ ప్రెసిడెంట్ నంది కిషన్, ఎస్సీ ఎస్టీ జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యుడు బిపేట రాజకుమార్, మాజీ వైస్ ప్రెసిడెంట్ గుండాడి రాంరెడ్డి, ఉప సర్పంచ్ బందారపు బాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మర్రి శ్రీనివాస్ రెడ్డి, బండారి బాల్‌రెడ్డి, లాలాబాయి, తులసి గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు భాగ్య, వీపీవో గుండం మంజుల, సీసీ దేవేందర్, సుదర్శన్, ఎరుపుల శ్రీనివాస్, మైనార్టీ నాయకులు రఫిక్, కోనేటి పోచయ్య, రాజేందర్ రెడ్డి, సర్పంచ్ మామిళ్ల కిషన్, ఏఎంసీ డైరెక్టర్లు, వార్డు సభ్యులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

నర్సంపేట సీఐ శ్రీనివాస్



కలంజ్యోతి, నర్సంపేట (అక్టోబర్ 27) : ప్రస్తుత డిజిటల్ యుగంలో రోజురోజుకూ పెరిగిపోతున్న సైబర్ మోసాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నర్సంపేట సీఐ ఎం. శ్రీనివాస్ సూచించారు. పట్టణంలోని ఎస్ఆర్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు సైబర్ క్రైమ్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు మొబైల్ వినియోగాన్ని తగ్గించి చదువుపైనే ప్రధానంగా దృష్టి సారించాలని, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలను పరిమితంగానే వాడాలని చెప్పారు. అపరిచితులు పంపే లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ తెరవవద్దని, ఉద్యోగాలు, బహుమతుల పేరిట వచ్చే ఫోన్ కాల్స్‌ను నమ్మి ఓటీపీలు, బ్యాంకు వివరాలు ఎవరికీ చెప్పవద్దని హెచ్చరించారు.

మోసపోతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలి..

సైబర్ నేరగాళ్లు ఆధునిక పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారని, సోషల్ మీడియాలో అపరిచితులతో వ్యక్తిగత వివరాలు, ఫొటోలు పంచుకోవద్దని ఎస్ఐ నిహారిక పేర్కొన్నారు. ఒకవేళ ఆన్‌లైన్ మోసానికి గురై డబ్బులు పోగొట్టుకుంటే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు గానీ, 112 నంబర్‌కు గానీ ఫిర్యాదు చేస్తే నగదు లావాదేవీలను నిలిపివేసే అవకాశం ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కొయ్యడి సనత్ కుమార్, పారామెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ శిరీష, వైస్ ప్రిన్సిపాల్ సూరయ్య, సంతోష్, వెంకన్న, రమేష్ నాయక్, లయన్ ప్రవీణ్, హరి భూషణ్, సందీప్, శ్వేత, నజీమా, కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.





పశువులకు ఉచిత వైద్య శిబిరం

కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 27) : కోనాపురం గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించి 96 పాడి పశువులకు వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ మైదం రాకేష్ ప్రారంభించిన ఈ కార్యక్రమంలో పశువైద్యులు డాక్టర్ మహమ్మద్ జునేద్ ఖాన్ మాట్లాడుతూ ఆడ దూడల కోసం లింగ నిర్ధారణ వీర్యం అందుబాటులో ఉందని, గోపాలమిత్ర సేవలను రైతులు ఉపయోగించుకోవాలని తెలిపారు. శిబిరంలో ఎదకు రాని 14 పశువులకు చికిత్స, 24 దూడలకు నట్టల నివారణ మందులు, 3 గేదెలకు కృత్రిమ గర్భధారణ, 4 పశువులకు గర్భకోశ చికిత్స, 32 పశువులకు చూడి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మండల నరసింహారాములు, జల్లి పీవీసీ డాక్టర్ వెంకట్ రాజ్, డాక్టర్ మంజీలాల్, జేవీఓ కర్ణాకర్, గోపాలమిత్ర సూపర్వైజర్ ఎం.డి. జహంగీర్, గోపాలమిత్రులు కళ్లెపు ప్రసాద్, బి. లక్ష్మీనారాయణ, బి. మధుకర్, అక్బర్, సీహెచ్. ప్రసాద్, ఏ. రమేష్, కె. రాజ్‌కుమార్, పాడి రైతులు పాల్గొన్నారు.

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

5

బుధవారం 28.10.2026

www.kalamjyothi.com



ఎమ్మెల్యే దొంతిని కలిసిన పీఏసీఎస్ చైర్మన్లు

సహకార సంఘాల బలోపేతానికి మాధవరెడ్డి హామీ

కలంజ్యోతి, నర్సంపేట (అక్టోబర్ 27) : నర్సంపేట నియోజకవర్గ పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) బలోపేతం, రైతులకు అందించాల్సిన సేవలపై ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డితో పలువురు సొసైటీ చైర్మన్లు మంగళవారం ఆయన స్వగృహంలో చర్చించారు. డీసీసీబీ మహాజన సభ అనంతరం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మందపల్లి సొసైటీ చైర్మన్, నియోజక వర్గ కన్వీనర్ తొకల శ్రీనివాస్‌రెడ్డి, వివిధ సొసైటీల చైర్మన్లు భూక్య గోపాల్ నాయక్, మొగిలి వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, కిరణ్‌రెడ్డి, వేలదే శ్రీనివాస్, రఘుపతిరావు, ప్రసాద్ తదితరులు ఉన్నారు.



దేశ విచ్ఛిన్న దుష్టశక్తులను తిప్పి కొట్టండి

బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

కలంజ్యోతి, నిర్మల్ : దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కాంగ్రెస్, కాక్రోచ్ లతో పాటు పలు పార్టీలు కుట్ర పన్నుతున్నాయని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. వీరి యత్నాలను తిప్పి కొట్టాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.ఖైంసాలో బిజెపి నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.తప్పుడు ప్రచారాలు చేస్తూ విధ్వంసం చేసేందుకు రాహుల్ గాంధీ కుట్ర పన్నారని ఆరోపించారు. విదేశాల నిధులతో కాక్రోచ్ ల ఆగదాలు మీతిమీరి పోతున్నాయన్నారు. వీరికి కొమ్ము కాస్తున్న ప్రతిపక్ష పార్టీల కుట్రలను తిప్పి కొట్టాల్సిన అవసరం ఉందన్నారు.

జనసంకల్ప యాత్ర ను జయ ప్రదం చేయండి..

వచ్చే నెల 3 న నిర్మల్ జిల్లా కేంద్రంలో చేపట్టే జన సంకల్ప యాత్రను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి నియోజకవర్గం నుండి వేలాది మంది కార్యకర్తలు, నాయకులు తరలి రావాలన్నారు. ఈ సమావేశంలో ముధోల్ ఎంఎల్ఏ రామారావు పటేల్, నాయకులు నారాయణ రెడ్డి తదితరులున్నారు.

అశ్లీల వీడియోలు షేర్ చేసిన ఇద్దరి అరెస్టు

కలంజ్యోతి, నిర్మల్ : చిన్నారుల లైంగిక దోపిడీకి సంబంధించిన వీడియోలను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసి, ఇతరులకు ఇన్‌స్టాగ్రామ్ ఖాతాల ద్వారా అప్‌లోడ్ చేసిన ఇద్దరు యువకులపై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఈ మేరకు వారిని రిమాండ్‌కు తరలించినట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గోవర్ధన్ రెడ్డి తెలిపారు. నిర్మల్ జిల్లా మామడ మండల పరిధిలోని ఇద్దరు యువకులు ఆన్‌లైన్ వెబ్‌సైట్ల నుంచి చిన్నారుల లైంగిక దోపిడీకి సంబంధించిన వీడియోలను డౌన్‌లోడ్ చేసి, తమ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాల ద్వారా అప్‌లోడ్ చేసినట్లు పోలీసుల విచారణలో గుర్తించినట్లు సీఐ వెల్లడించారు. ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఇద్దరు యువకులపై కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేసి వారిని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. చిన్నారులకు సంబంధించిన లైంగిక దోపిడీ చిత్రాలు, వీడియోలను డౌన్‌లోడ్ చేయడం, భద్రపరచడం, ఇతరులకు పంపడం, సోషల్ మీడియాలో వైరల్ చేయడం తీవ్రమైన చట్టపరమైన పరిణామాలకు దారితీస్తుందని ఆయన స్పష్టం చేశారు.

కేంద్రంలో రాహుల్.. రాష్ట్రంలో రేవంత్

మల్లికార్జున ఖర్గే చిత్రపటానికి కాంగ్రెస్ శ్రేణుల పాలాభిషేకం

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 27) : భవిష్యత్తులో కేంద్రంలో రాహుల్ గాంధీ ప్రధానమంత్రిగా, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఏఎంసీ చైర్మన్ మేడిపల్లి దేవానందం, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు దొమ్మాటి నరసయ్య, సీనియర్ నాయకుడు షేక్ గౌస్ బాయ్ ధీమా వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చిత్రపటానికి మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం పాలాభిషేకం నిర్వహించారు. బీజేపీ నాయకులు ఖర్గే దిష్టిబొమ్మను దగ్ధం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ, కేంద్రం ఓటర్ల తొలగింపు కుట్రలను ప్రశ్నిస్తే ఓర్వలేక బీజేపీ నేతలు దళిత నాయకుడిపై అక్కసు వెళ్లగక్కుతున్నారని మండిపడ్డారు. ఓటర్ల తొలగింపునకు వ్యతిరేకంగా నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో చేపట్టే నిరసనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే బీజేపీ సీనియర్లు యువకులను రెచ్చగొట్టి ఆందోళనలు చేయిస్తూ కేసుల పాలు చేస్తున్నారని, ఇకపై చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ ప్రెసిడెంట్ నంది కిషన్, మాజీ వైస్ ప్రెసిడెంట్ గుండాడి రాంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు మర్రి శ్రీనివాస్ రెడ్డి, బండారి బాల్‌రెడ్డి, సురేందర్, బీపేట రాజ్‌కుమార్, లాలాబాయి, గుళ్లపెల్లి లక్ష్మిరెడ్డి, గ్రామ శాఖల అధ్యక్షులు, ఏఎంసీ డైరెక్టర్లు, వార్డు సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.









పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం..

శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన వీరులు కుటుంబాల సంక్షేమానికి పోలీస్ శాఖ కట్టుబడి ఉంది

ఎస్పీ మహేష్ బి. గితే

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 27) : పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా సిరిసిల్ల పట్టణంలోని హెబ్రోను చర్చిలో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే మంగళవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సమాజ రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో ఉండాలని చర్చి పాస్టర్లు, ఫాదర్లతో కలిసి ఆయన ప్రార్థించారు. అమరుల త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని, సమాజంలో శాంతిసామరస్యాలు వెల్లివిరియాలని ఎస్పీ ఆకాంక్షించారు.

కుటుంబాల సంక్షేమానికి పోలీస్ శాఖ కట్టుబడి ఉంది..

విధులు నిర్వర్తిస్తూ అమరులైన పోలీసుల కుటుంబాలకు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎస్పీ మహేష్ బి. గితే స్పష్టం చేశారు. వారి కుటుంబాల సంక్షేమానికి తాము అత్యంత ప్రాధాన్యతనిస్తామని భరోసా ఇచ్చారు. ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యాలు చేకూరాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ వెంట డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ శ్రీనివాస్, చర్చి పాస్టర్లు, ఫాదర్లు తదితరులు పాల్గొన్నారు.

కలం జ్యోతి
తెలుగు దినపత్రిక
6
బుధవారం 28.10.2026
www.kalamjyothi.com



జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాలివ్వాలి

హెల్త్ కార్డులు, అక్రిడిటేషన్లు మంజూరు చేయాలని వినతి

ఇంటి స్థలాల కేటాయింపునకు మంత్రి పొంగులేటి హామీ

కలంజ్యోతి, సంగారెడ్డి (అక్టోబర్ 27) : సంగారెడ్డి జిల్లాలోని ప్రతి మండలంలో ఉన్న అర్హులైన జర్నలిస్టులందరికీ వెంటనే ఇంటి స్థలాలు మంజూరు చేయాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా శాఖ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సంగారెడ్డి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా సమీక్షా సమావేశానికి హాజరైన రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి సంఘం జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి ఆధ్వర్యంలో నేతలు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఏర్పడి కాలం గడుస్తున్నా జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం కాలేదని, వెంటనే అర్హుల జాబితా రూపొందించి ఇళ్ల స్థలాలు కేటాయించాలని, హెల్త్ కార్డులు లేక అనారోగ్యంతో జర్నలిస్టుల కుటుంబాలు రోడ్డున పడుతున్నందున నగదు రహిత వైద్య సేవలందించే కార్డులు ఇవ్వాలని, మిగిలిపోయిన వారికి అక్రిడిటేషన్లు జారీ చేయాలని కోరారు.

ఇంటి స్థలాల కేటాయింపునకు మంత్రి పొంగులేటి హామీ..

జర్నలిస్టుల సమస్యలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ హైదరాబాద్ జర్నలిస్టులకు స్థలాలు కేటాయించిన అనంతరం సంగారెడ్డి జిల్లాలోని అర్హులైన జర్నలిస్టులందరికీ కచ్చితంగా ఇంటి స్థలాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లాకు చెందిన వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సైతం స్థానిక జర్నలిస్టుల సమస్యలను మంత్రి పొంగులేటికి వివరించగా, వేదికపై నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నాయకులు రాజు నాయక్, హెచ్ఎంటీవీ శ్రీనివాస్, బాలయ్య, శ్రీకాంత్, ఫోటో జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు హత్నూరలో ఎమ్మెల్యే సునీతారెడ్డి పర్యటన

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రామచంద్రారెడ్డి



కలంజ్యోతి, హత్నూర (అక్టోబర్ 27) : నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి బుధవారం హత్నూర మండలంలో విస్తృతంగా పర్యటించనున్నారని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు రామచంద్రా రెడ్డి తెలిపారు. పర్యటనలో భాగంగా చింతలచెరువు గ్రామంలో నూతన గృహప్రవేశం, మంగాపూర్ గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవం, దౌల్తాబాద్ గ్రామంలో పాఠశాల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొంటారని వివరించారు. ఈ కార్యక్రమాల్లో హత్నూర మండల పరిధిలోని సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, బీఆర్ఎస్ శ్రేణులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

కెనాల్‌లో వృద్ధురాలి మృతదేహం లభ్యం!

నెల రోజుల క్రితం అదృశ్యమైన రాజవ్వగా గుర్తింపు

కలంజ్యోతి, ఇల్లంతకుంట (అక్టోబర్ 27) : ఓబులాపూర్ గ్రామ శివారులోని కెనాల్‌లో గుర్తుతెలియని మహిళ మృతదేహం మంగళవారం లభ్యం కాగా, ఆమె నెల రోజుల క్రితం అదృశ్యమైన సంపతి రాజవ్వ (70)గా కుటుంబ సభ్యులు గుర్తించారు. భర్త నాయకయ్యతో కలిసి గత నెలలో అదృశ్యమైన రాజవ్వ ఆచూకీ కోసం గాలిస్తుండగా, కెనాల్‌లో శవం తేలిన సమాచారంతో బంధువులు చేరుకుని దుస్తులు, ఆభరణాల ఆధారంగా ఆమెను గుర్తుపట్టారు. సమాచారం అందుకున్న ఎస్సై ఉపేంద్ర చారి ఘటనా స్థలానికి చేరుకుని సిరిసిల్ల నుంచి ఫోరెన్సిక్ వైద్యులను రప్పించి అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రంలో భారీ పెట్టుబడులే లక్ష్యం

ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్‌కు ఏర్పాట్లు ముమ్మరం

రేపు ఢిల్లీలో సీఎం చేతుల మీదుగా కర్టెన్ రైజర్

రక్షణ, ఏరోస్పేస్ రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యం

సీఎస్ సంజయ్ జాబు



కలంజ్యోతి, హైదరాబాద్ (అక్టోబర్ 27) : తెలంగాణను ప్రపంచ స్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026' సన్నాహాలు ముమ్మరమ య్యాయని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వెల్లడించారు. ఈ సమ్మిట్‌లో పాల్గొనేందుకు 550కి పైగా దేశీయ, అంతర్జాతీయ దిగ్గజ సంస్థలను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న ఈ సదస్సు ఏర్పాట్లపై ఆయన సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి గడువులోగా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

రేపు ఢిల్లీలో సీఎం చేతుల మీదుగా కర్టెన్ రైజర్

గ్లోబల్ సమ్మిట్‌కు అంతర్జాతీయ స్థాయిలో విస్తృత గుర్తింపు తీసుకురావడంలో భాగంగా ఈ నెల 29న న్యూఢిల్లీలో కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సీఎస్ సంజయ్ జాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరుకానుండగా, వివిధ దేశాల రాయబారులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు, దిగ్గజ కంపెనీల అధిపతులు పాల్గొంటారని పేర్కొన్నారు. తెలంగాణలోని పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేసేందుకు ఇది కీలక వేదిక కానుందని, ఇప్పటికే చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌లలో రోడ్‌షోలు నిర్వహించినట్లు చెప్పారు. ఫ్యూచర్ సిటీలో జరిగే ప్రధాన సదస్సుకు 1,500కు పైగా సంస్థల ప్రతినిధులను ఆహ్వానిస్తున్నామని, భారీ పెట్టుబడులు, పారిశ్రామికాభివృద్ధి, యువతకు విస్తృత ఉపాధి కల్పించడమే ఈ సదస్సు లక్ష్యమని వివరించారు.

రక్షణ, ఏరోస్పేస్ రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యం

సమ్మిట్‌లో భాగంగా నిర్వహించనున్న 'రక్షా ఎక్స్‌పో'లో పాల్గొనేందుకు ప్రపంచవ్యాప్తంగా రక్షణ, ఏరోస్పేస్ రంగాలకు చెందిన సుమారు 100 సంస్థలకు ప్రత్యేక ఆహ్వానాలు పంపుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఎక్స్‌పోలో రాష్ట్రానికి చెందిన రక్షణ, ఏరోస్పేస్ రంగ ప్రతినిధులు కూడా భాగస్వామ్యం కానున్నారు. సమ్మిట్ వేదికను 25 సెక్టార్లుగా విభజించి ఫ్లీనరీ భేటీలు, సెమినార్లు, చర్చలు, ఒప్పందాలు, ఎగ్జిబిషన్లకు తగిన వసతులు కల్పిస్తున్నారు. తెలంగాణ సంస్కృతి, కళా వైభవాన్ని చాటేలా సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేయనున్నారు.

పకడ్బందీగా ప్రతినిధుల సమన్వయం

దేశీయ, అంతర్జాతీయ ప్రతినిధులకు రవాణా, వసతి, సమావేశాల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సీఎస్ సూచించారు. విదేశీ ప్రతినిధులతో సమన్వయం కోసం సీనియర్ అధికారులను నోడల్ అధికారులుగా నియమిస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అగ్రగామిగా నిలపడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ఈ సమ్మిట్‌ను అత్యంత విజయవంతం చేసేందుకు యంత్రాంగం సన్నద్ధమవుతోందని స్పష్టం చేశారు.

వాళ్లు నన్ను వేధిస్తున్నారు

తన నివాసంలో సోషల్ మీడియా వీడియోల చిత్రీకరణను అడ్డుకుంటూ హౌసింగ్ సొసైటీ కమిటీ సభ్యులు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని సినీ నటి, సోషల్ మీడియా సెన్సేషన్ ఉర్ఫీ జావెద్ మండిపడ్డారు. సొంత ఇంట్లో కంటెంట్ షూట్ చేయకూడదని కొత్త రూల్స్ తెచ్చారని, గతంలో రాత్రిపూట అతిథుల రాకపై పెట్టిన ఆంక్షలపై ముంబై పోలీసులకు ఫిర్యాదు చేసినందుకే తనపై కక్ష పెంచుకుని వేధింపులకు పాల్పడుతున్నారని ఆమె ఆరోపించారు. తనను ఖాళీ చేయించాలని ఇంటి యజమానిని కోరినా ఆయన తిరస్కరించడంతో, ఇప్పుడు తన వద్దకు వచ్చే సందర్శకుల బ్యాగులను గేటు వద్దే తనిఖీ చేస్తూ పురుషాహంకారంతో వేధిస్తున్నారని, సొంత ఇంట్లో తాను ఏం చేసుకున్నా అది తన వ్యక్తిగత విషయమని ఆమె స్పష్టం చేశారు.



Printed and Published by PENDYALA JYOTHI on behalf of PENDYALA JYOTHI, Printed at Rudra Kakatiya Printers and Graphics H.no.183/85/12/38, Somidi Road, Kazipet, Warangal, 506003., Published at H.No. 30/1/426, Madikonda, Kazipet, Hanumakonda District. Telangana, 506142, Editor : RAMESH PENDYALA. Ph : 9494 009 003.